మంగళవారం

13-08-2024

# ముందడుగు

దినపత్రిక


సంపుటి: 1 సంచిక: 423 పేజీలు: | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



ఖైదీల జీవితాలంటే ఎందుకంత నిర్లక్ష్యం

మిగతా 2లో



రాష్ట్రపతి నుంచి ఆహ్వానం

మిగతా 2లో





మీ ఆధార్ కార్డుకు తప్పడు ఫోన్ నంబర్ లింక్ అయిందా..?

మిగతా 4లో

ASCI The Advertising Standards Council of India

53 ప్రముఖ యాప్స్ లో 52 యాప్స్ మోసపూరితమైనవే

మిగతా 5లో



# తెలంగాణలో మెగా కారు టెస్టింగ్ సెంటర్

## హ్యుందాయ్ కంపెనీ ప్రతినిధులతో రేవంత్ రెడ్డి భేటీ

ముందడుగు తెలంగాణ

తెలంగాణ మెగా కారు టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు ఆ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆటోమేటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు ఎలక్ట్రికల్ వాహనాలు సహా అత్యాధునిక టెస్ట్ కార్ల తయారీ సదుపాయం ఉండేలా ప్రణాళికలు రచిస్తోంది. హైదరాబాద్‌లో ఉన్న ఇంజినీరింగ్ కేంద్రాన్ని విస్తరించాలని హ్యుందాయ్ తెలిపింది. భారతీయ వినియోగదారుల కోసం బెంచ్‌మార్క్ ఉత్పత్తులు, సాంకేతికత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హ్యుందాయ్ ప్రతినిధులు సీఎం రేవంత్ బృందానికి తెలిపారు. హ్యుందాయ్ మోటార్ కంపెనీ తన అనుబంధ సంస్థ హెచ్‌ఎంఐఈ ద్వారా తెలంగాణలో కార్ టెస్టింగ్ సదుపాయం నెలకొల్పేందుకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళిక చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పారిశ్రామిక స్నేహపూర్వక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఆటంకాలు లేని అనుమతుల వ్యవస్థతో తెలంగాణలో వ్యాపారం చేసేందుకు హెచ్‌ఎంఐఈ వంటి అత్యుత్తమ కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగానూ భారీగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుందని తెలిపారు.పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా అమెరికాలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి బృందం ప్రస్తుతం కొరియాకు చేరుకొని అక్కడ పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.



# మమతా బెనర్జీ పోలీసులకు అల్టిమేటం

- వారం రోజుల్లో కేసు సంగతి ఐపోవాలి
- వైద్యురాలి కేసుపై పోలీసులకు దీదీ డెడ్‌లైన్

ముందడుగు పశ్చిమబెంగాల్

పశ్చిమ బెంగాల్ కలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటన పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. నిందితుడికి కఠినంగా శిక్ష పడాలంటూ వైద్యులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోలీసులకు అల్టిమేటం ఇచ్చారు. వారం రోజుల్లో కేసును పరిష్కరించలేకపోతే సీబీఐకి అప్పగిస్తామన్నారు. ఈ ఘటనపై ప్రతిపక్ష భాజపా నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్న వేళ పోలీసులు దీదీ ఈ డెడ్‌లైన్ విధించారు.

సీఎం మమతా బెనర్జీ సోమవారం మృతురాలి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "ఈ కేసులో మరింతమంది నిందితులు ఉన్నట్లయితే వారందరినీ ఆదివారం లోగా అరెస్టు చేస్తాం. ఒకవేళ అప్పటిలోగా రాష్ట్ర పోలీసులు కేసును పరిష్కరించలేకపోతే దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తాం. ఈ కేసుపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరగాలని మేం కోరుకుంటున్నాం" అని దీదీ వెల్లడించారు.




# భారతదేశపు మొదటి క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్-ఎంజి విండ్సర్

ముందడుగు హైదరాబాద్

ఎంతగానో అంచనా వేయబడిన క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ – ఎంజి విండ్సర్ తమ విభాగంలోనే తొలిసారి ఏరో-లౌంజ్ సీట్స్ తో విలాసం మరియు సౌకర్యాలతో నిరంతరంగా కలిసిపోయింది. ఎంజి విండ్సర్ యొక్క ప్రత్యేకమైన ఫీచర్లలో ఒకటి దాని 135⁰ వాలుతో, ఏరో-లౌంజ్ సీట్స్ సాటిలేని విలాసం మరియు విశ్రాంతిలను అందించడానికి రూపొందించబడ్డాయి. నైపుణ్యవంతంగా రూపొందించబడిన రిక్లైన్ కోణం దూర ప్రయాణాల్లో అయినా లేదా సిటీలో డ్రైవ్ కోసం అయినా ప్రయాణికులు స్టైల్ గా విశ్రాంతి చెందడాన్ని నిర్ధారిస్తుంది. విండ్సర్ కాజల్ యొక్క వైభవంతో తెలివైన సియూవీలో ప్రేరేపించబడిన, విశాలమైన కేబిన్ అందం, అనుకూలతల ప్రాధాన్యతలతో రూపొందించబడి ప్రశాంతత మరియు సమృద్ధిల భావనను పెంచాయి.

ముందడుగు
మంగళవారం, 13-08-2024, హైదరాబాద్



# ఖైదీల జీవితాలంటే ఎందుకంత నిర్లక్ష్యం

## యూపీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

ముందడుగు జాతీయం

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో చాలా మంది ఖైదీల బెయిల్ పిటిషన్లు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోర్టు పేర్కొంది. ఖైదీల క్షమాభిక్ష దరఖాస్తుల పరిష్కారానికి కోర్టు కాల పరిమితిని విధించింది. దీనిని యుపి ప్రభుత్వం అనుసరించలేదు. దీని కారణంగా కోర్టు రాష్ట్రాన్ని మందలించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు క్షమాపణలు చెప్పింది. కానీ కోర్టు క్షమాపణలను తిరస్కరించింది. మా ఆర్డర్‌ను ఆమోదించిన తర్వాత కూడా మీరు 2-4 నెలలు ఎలా తీసుకుంటారని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఎజి మసీహ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఖైదీల హక్కులకు విరుద్ధమని కోర్టు పేర్కొంది. నేరస్తుల ప్రాథమిక హక్కులతో ఆటలాడుతున్నారు. కోర్టు ప్రకటనపై యూపీ తరపు న్యాయవాది రాకేష్ కుమార్ స్పందిస్తూ.. అధికారులు సెలవులో ఉన్నారని తెలిపారు. దానికి సుప్రీంకోర్టు స్పందిస్తూ, గౌరవ ముఖ్యమంత్రి సచివాలయం ఫైల్‌ను ఆమోదించలేదని.. అధికారుల పేర్లను ముందుకు తీసుకురాలేదని అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొంది. న్యాయవాది రాకేష్ కుమార్ ఫైల్‌ను స్వీకరించడానికి నిరాకరించిన బాధ్యుల పేర్లను సమర్పించాలని మేము ఆదేశిస్తున్నామని కోర్టు పేర్కొంది. ధిక్కారంపై ఎలాంటి నిర్ణయం తీసుకునే ముందు, ఆగస్టు 14లోగా ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారులకు అఫిడవిట్ సమర్పించాలని సూచించింది. ఈ కేసును ఆగస్టు 20న జాబితా చేసింది.

# వయనాడ్‌లో 130మంది ఆచూకీ లభించలే

## సమీప అడవులపై దృష్టిపెట్టిన ప్రభుత్వం.. 190 మంది అటవీ అధికారుల బృందం గాలింపు

ముందడుగు కేరళ



కేరళ వయనాడ్‌లో జులై 30న కొండచరియలు విరిగిపడిన ఘటనలో 229 మంది చనిపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. వీరిలో 51 మందిని ఇంకా గుర్తించాల్సి ఉందని తెలిపింది. వీరికి సంబంధించిన డీఎన్ఏ నివేదిక ఆగస్టు 13లోగా వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు దాదాపు 130 మంది ఆచూకీ ఇంకా లభించలేదని ప్రభుత్వం వెల్లడించింది. వీరికోసం గడిచిన రెండు వారాలుగా ముమ్మర గాలింపు కొనసాగుతోంది. ఎన్డీఆర్ఎఫ్, పోలీస్, అగ్నిమాపక, అటవీశాఖలకు చెందిన 190 మంది సభ్యుల బృందం.. వరదలు చోటుచేసుకున్న ప్రాంతాన్ని జల్లెడపడుతున్నాయి. ఇందులో భాగంగా చలియార్ నది, దాని పరివాహక ప్రాంతాలు, సమీప అడవులపై దృష్టిసారించినట్లు ఏడీజీపీ ఎం ఆర్ అజిత్ కుమార్ పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను ఇప్పటికే ఒకసారి గాలించామని, తాజాగా నది, దాని తీర ప్రాంతాలపై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. ఎగువ ప్రాంతం మొత్తం పూర్తికాగా, ప్రస్తుతం దిగువన తమ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. అయితే, నీటి స్థాయిలు తగ్గడంతో మృతదేహాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. భారీ వర్షం కారణంగా సెర్చ్ ఆపరేషన్‌కు అంతరాయం కలుగుతోందన్నాయి. అయితే, సోమవారం చేపట్టిన గాలింపులో పలు శరీర భాగాలు లభ్యమైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

# కవితకు బెయిల్ నిరాకరించిన సుప్రీంకోర్టు

## బెయిల్ పిటిషన్ ఆగస్టు 20వ తేదీకి వాయిదా

ముందడుగు ఢిల్లీ



ఢిల్లీ లిక్కర్ కేసులో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీహార్ జైల్లో ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే బెయిల్ కోసం అనేకసార్లు ప్రయత్నం చేసిన కవిత చివరి ప్రయత్నంగా సుప్రీంకోర్టులో మధ్యంతర బెయిల్ కోసం అప్పీల్ చేసుకుంది. అయితే నేడు ఈ పిటిషన్ పై విచారణ జరిపిన ధర్మాసనం విచారణను వాయిదా వేసి కవితకు షాక్ ఇచ్చింది.

### మళ్లీ నిరాశ

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడి, సిబిఐ కేసుల్లో ఎమ్మెల్సీ కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించడంతో మళ్లీ కవితకు నిరాశ ఎదురైంది. ఈ కేసులో తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలి అని కవిత తరపు న్యాయవాది కోర్టులో వాదించగా ప్రతివాదుల వాదనలు వినకుండా మధ్యంతర ఉపశమనం కల్పించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో ప్రతి వాదులుగా ఉన్న దర్యాప్తు సంస్థలు ఈడీ, సిబిఐలకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. కవిత బెయిల్ పిటిషన్ ఆగస్టు 20వ తేదీకి వాయిదా వేస్తూ కోర్టు నిర్ణయించింది. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో మధ్యంతర బెయిల్ కోరుతున్న కవిత పిటిషన్ పై స్పందించాలని ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న సిబిఐ, ఈడికి సుప్రీం నోటీసులు పంపించడంతో దీనిపై ఈడి, సిబిఐ అధికారులు తమ స్పందనను తెలియజేయనున్నారు.

# పూజా ఖేడ్కర్ తక్షణ కస్టడీ అవసరం లేదు


## ఢిల్లీ హైకోర్టులో స్వల్ప ఊరట

ముందడుగు ఢిల్లీ



వివాదాస్పద ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు ఢిల్లీ హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తక్షణ కస్టడీ అవసరం లేదంటూ ఆమెకు తాత్కాలిక ఉపశమనం కలిగింది. అరెస్టు నుంచి ఆగస్టు 21 వరకు రక్షణ కల్పించింది. ముందస్తు బెయిల్ కోసం పూజ పిటిషన్ వేసిన నేపథ్యంలో ఢిల్లీ పోలీసులకు కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ దానిపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేయడంతో పాటు అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు దిల్లీ కోర్టు ఇదివరకే నిరాకరించింది. ఈ క్రమంలో ఆమె దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఆమెపై వచ్చిన ఆరోపణలకు సమాధానం ఇవ్వడానికి తగిన సమయం ఇవ్వాలని పూజ తరపు న్యాయవాదులు కోర్టులో వాదించారు. ఈ క్రమంలోనే ఆమెకు ఊరట లభించింది.

ముందడుగు
మంగళవారం, 13-08-2024, హైదరాబాద్



# తిరుమల ఘాట్ రోడ్డులో టూవీలర్స్‌పై ఆంక్షలు

## సెప్టెంబర్ 30వ తేదీ వరకు అమలు

ముందడుగు తిరుమల

తిరుమల కొండకు బైక్‌పై వెళ్లే భక్తులకు అలర్ట్. ఘాట్ రోడ్డులో టూవీలర్స్‌పై ఆంక్షలు విధించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే కొండపైకి ద్విచక్రవాహనాలను అనుమతించనున్నారు. ఈ ఆంక్షలు సెప్టెంబర్ 30వ తేదీ వరకు అమలులో ఉన్నాయి. నిన్న రాత్రి మొదటి ఘాట్ రోడ్డులో చిరుత కనిపించిన నేపథ్యంలో టీటీడీ ఈ ఆంక్షలు విచింది. తిరుమలలో ఇటీవల చిరుతలు తరచూ కనిపిస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి కూడా ఓ చిరుత కలకలం సృష్టించింది. ఆదివారం రాత్రి చిరుత కలకలం సృష్టించింది. రాత్రి 9 గంటల సమయంలో మొదటి ఘాట్ రోడ్డులోని 55, 56వ మలుపు సమీపంలో ఓ చిరుత రోడ్డు దాటి అడవిలోకి వెళ్లడాన్ని వాహనదారులు గుర్తించారు. భయాందోళనలకు గురైన భక్తులు వెంటనే టీటీడీ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు.



# సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్

## మెయిల్ అభ్యర్థన పంపాలని చెప్పిన సీజేఐ

ముందడుగు ఢిల్లీ

మనీలాండరింగ్ కేసులో అరెస్టైన తనను విడుదల చేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎక్సైజ్ కేసులో సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. తన అరెస్టు, రిమాండ్‌పై జూన్‌లో ఢిల్లీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పునకు ఇది వ్యతిరేకంగా ఉందని పిటిషన్‌లో వెల్లడించారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని కేజ్రీవాల్ తరపు న్యాయవాది సుప్రీంను కోరగా తమకు మెయిల్ అభ్యర్థన పంపాలని భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తెలిపారు.



# క్యాపిటల్ స్మాల్ఫైనాన్స్ బ్యాంక్ మరియు ఎడెల్‌వీస్ లైఫ్ ఇన్సూరెన్స్ ఒప్పందం

ముందడుగు హైదరాబాద్

భారతదేశపు మొట్టమొదటి స్మాల్ ఫైనాన్స్ బ్యాంక క్యాపిటల్ స్మాల్ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, మరియు ఎడెల్‌వీస్ లైఫ్ ఇన్సూరెన్స్ముంబైలో తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఈ సహకారంతో క్యాపిటల్ స్మాల్ఫైనాన్స్ బ్యాంక్‌కు చెందిన విభిన్న కస్టమర్ బేస్ ఎడెల్‌వీస్లైఫ్ ఇన్సూరెన్స్ సమగ్ర జీవితబీమా ఉత్పత్తులను పొందే వెసులుబాటు కల్పించడం ద్వారా వారికి ఆర్థిక భద్రత అవసరాన్ని పరిష్కరిస్తుంది. క్యాపిటల్స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, మేనేజింగ్డైరెక్టర్ మరియు సీఈఓ సర్వజిత్సింగ్ సమ్రా మాట్లాడుతూ,"ఎడెల్‌వీస్లైఫ్ ఇన్సూరెన్స్‌తో మావ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటిస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము. మేము మా ఆర్థిక పరిష్కారాలను విస్తరిస్తున్న సమయంలో, ఎడల్‌వీస్లైఫ్‌తో చేసుకున్న ఈ ఒప్పందం సమగ్రంగా అందించే మా సామర్థ్యాన్నిపెంచుతుంది. మా వినియోగదారులకు అనుకూలమైనజీవిత బీమా ఉత్పత్తులు, నాణ్యమైన బీమా పరిష్కారాల అందుబాటును మెరుగుపరచడం ద్వారా మాస్థానాన్ని బలోపేతం చేసుకుంటూ, మామధ్య-ఆదాయ సమూహ వినియోగదారులకు మరింత సురక్షితమైన, సుసంపన్నమైన భవిష్యత్తును సృష్టించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము"అని వివరించారు.



# నా గ్రామానికి రోడ్లు వేయండి

- గ్రామస్థుల సహకారంతోనే ఈ స్థాయికి వచ్చా
- పాక్ ప్రభుత్వానికి అర్షద్ నదీమ్ విజ్ఞప్తి

ముందడుగు పాకిస్తాన్

పాక్ ప్రభుత్వానికి అర్షద్ నదీమ్ తన గ్రామం కోసం ఓ విజ్ఞప్తి చేశాడు. గ్రామస్థుల సహకారంతో అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన నదీమ్ వారికోసం ఏదైనా చేయాలని సంకల్పించాడు. "మా గ్రామంలో రోడ్లు వేయాల్సిన అవసరం ఉంది. వంట గ్యాస్ సరఫరా కూడా సరిగా లేదు. ఆ సదుపాయం కల్పిస్తే నాతోపాటు మా గ్రామానికి చాలా ఉపయోగం. మియాన్ చాన్నులో ఓ యూనివర్సిటీ రావాలనేది నా కల. మా సోదరీమణులు వేరే సిటీకి వెళ్లి చదువుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ముల్తాన్‌కు వెళ్లాలంటే కనీసం రెండు గంటలపాటు ప్రయాణించాలి. అదే ఒక యూనివర్సిటీ మాకు దగ్గరగా ఉంటే చాలామంది గ్రామీణులకు ఉపయోగకరం. క్రీడాకారులకు మద్దతుగా నిలుస్తున్న పాక్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నా. గ్రామంలోని ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ విజయం వెనుక వారందరి పాత్ర ఉంది. ఈవెంట్ల కోసం వెళ్లేందుకు సహకారం అందించారు. పారిస్ నుంచి స్వదేశానికి చేరుకున్న అతడికి ఘన స్వాగతం లభించింది. ఈ ఒలింపిక్స్‌లో పాక్‌కు ఒకే ఒక్క పతకం వచ్చింది. అదీ కూడా నదీమ్ సాధించిన గోల్డ్ మెడలే.

# మాజీ క్రికెటర్ కుమారుడికి రెండు స్వర్ణాలు

## అమెరికా తరపున బరిలో దిగిన రాయ్ బెంజమిన్

ముందడుగు డెస్క్

విండీస్ మాజీ క్రికెటర్ విన్‌స్టన్ బెంజమిన్ కుమారుడు రాయ్ బెంజమిన్ కూడా ప్రారంభంలో క్రికెట్ వైపే మొగ్గు చూపించాడు. కానీ, అతడిలోని రేసర్‌ను గుర్తించిన అంటగ్వా కోచ్‌లు ట్రాక్ అండ్ ఫీల్డ్ వైపు మళ్లించారు. దీంతో తండ్రి దారికి భిన్నమైన పంథాలో వెళ్లాడు. ఇప్పుడదే అతడిని స్టార్‌ను చేసింది. అథ్లెటిక్స్ వైపు వెళ్లిన రాయ్ ఇప్పుడు పారిస్ ఒలింపిక్స్‌లో ఏకంగా రెండు స్వర్ణాలు సాధించాడు. అయితే, అతడు అమెరికా తరపున బరిలోకి దిగడం గమనార్హం. తన కుమారుడి విజయంపై మాజీ క్రికెటర్ విన్‌స్టన్ ఆనందం వ్యక్తంచేశారు. క్రికెట్‌తో పోలుస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నేనెప్పుడూ ఇలాంటి అనుభూతిని పొందిన వారిని కలవలేదు. ఈ ఆనందం మాటల్లోనే చెప్పలేను. జీవితంలో అద్భుత క్షణాలు ఇవే. రాయ్ సాధించిన అచీవ్‌మెంట్‌కు హ్యాపీగా ఉంది. అతడు ఎంత శ్రమించాడో నాకు తెలుసు. ఇలాంటి ఘనత కోసం చాలా కష్టపడ్డాడు. స్వర్ణాలు గెలిచిన క్షణాలను చూస్తుంటే వరల్డ్ కప్ ఫైనల్ గుర్తుకొచ్చింది" అని తెలిపారు.



ముందడుగు
మంగళవారం,
13-08-2024,
హైదరాబాద్

# శ్రీశైలం మల్లన్నకి వెండి నాగాభరణం విరాళం



ముందడుగు శ్రీశైలం

శ్రీశైలం మల్లన్నకి ఒంగోలుకి చెందిన టి. శ్రీనివాసరావు సోమవారం వెండి నాగాభరణాన్ని విరాళంగా అందజేశారు. ఈ నాగాభరణం బరువు 3 కేజీల 150 గ్రాములు, అమ్మవారి ఆలయప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు వీటిని వేదపండితులు గంటి రాధకృష్ణ అవధాని, అమ్మవారి ఆలయం ఇన్స్పెక్టర్ కె. మల్లికార్జున, గుమాస్తా ఎం. సావిత్రికి అందజేశారు. అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో శ్రీస్వామి అమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో పలువురు అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు.

## మీ ఆధార్ కార్డుకు తప్పుడు

# ఫోన్ నంబర్ లింక్ అయిందా..?

## ఒకసారి చేసుకోండి.. లేదంటే జైలుకే..

ముందడుగు ప్రత్యేకం

దేశంలోని ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. ఇది ఐడెంటిటీ, అడ్రస్ ప్రూఫ్‌గా పని చేస్తుంది. ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడానికి ఈ డాక్యుమెంట్ అవసరం. ఇంకా అనేక అవసరాలకు ఇది తప్పనిసరి అవసరం. అయితే ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆధార్‌ను దుర్వినియోగం చేస్తే, జైలుకు వెళ్లే ప్రమాదం కూడా ఉంది. ముఖ్యంగా మీ ఆధార్ కార్డుకు తప్పుడు ఫోన్ నంబర్ లింక్ అయితే, చాలా ప్రమాదాలు ఎదురు కావచ్చు. అందుకే మీ ఆధార్‌కి మీ ఫోన్ నంబరే లింక్ అయిందా? తప్ప నంబర్ ఉందా? అనేది తెలుసుకోవాలి.

### జైలుకు వెళ్లే ముప్పు?

- మీ ఆధార్ కార్డ్ నంబర్‌కి నకిలీ సిమ్ కార్డ్ లింక్ అయితే లేదా మీ ఆధార్ కార్డ్‌తో వేరొకరికి సిమ్ తీసిస్తే వెంటనే అప్రమత్తం అవ్వండి. ఆన్‌లైన్‌లో ఈ నంబర్లను తొలగించండి. లేకుంటే మీరు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎందుకంటే మీ ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్‌తో ఏదైనా నేరాలు జరిగితే, మీరు జైలు శిక్ష లేదా జరిమానా భరించాల్సి వస్తుంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో సేఫ్‌గా ఉండాలంటే.. మీ ఆధార్‌కు సొంత ఫోన్ నంబర్, మీ సిమ్ ఒక్కటే లింక్ అయ్యి ఉండాలి.

### ఎలా తెలుసుకోవాలి?

- మీ ఆధార్‌తో ఏ సిమ్ కార్డ్ లింక్ అయిందో తెలుసుకోవడం చాలా సింపుల్. ఇంట్లో కూర్చొని ఆన్‌లైన్ ద్వారా ఇది తెలుసుకోవచ్చు. ఎలాగంటే..
- ముందు ఆధార్ అధికారిక వెబ్‌సైట్ https://uidai.gov.in/en/ విజిట్ చేయాలి.
- హోమ్ పేజీ టాప్ లెఫ్ట్ కార్నర్‌లో 'మై ఆధార్' ఆప్షన్‌పై క్లిక్ చేయండి.
- మొబైల్ ఫోన్‌లో ఆధార్ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేస్తే, టాప్ లెఫ్ట్ కార్నర్‌లో మూడు లైన్లు కనిపిస్తాయి. వాటిపై క్లిక్ చేస్తే మై ఆధార్ ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి.
- తర్వాత కిందకు స్క్రోల్ చేస్తే 'ఆధార్ సర్వీసెస్' ఆప్షన్ కనిపిస్తుంది.
- దీన్ని సెలక్ట్ చేసి, వెరిఫై ఇమెయిల్/మొబైల్ నంబర్ ఆప్షన్ ట్యాప్ చేయాలి.
- ఇప్పుడు మరో కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో రెండు ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో 'చెక్ మొబైల్ నంబర్'పై క్లిక్ చేయాలి.
- తర్వాత ఆధార్ కార్డులోని 12 అంకెలను, మొబైల్ నంబర్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాలి.
- ఇప్పుడు కిందున్న సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేస్తే, మీరు ఎంటర్ చేసిన మొబైల్ నంబర్‌కి వెరిఫికేషన్ కోడ్ వస్తుంది.
- ఆ కోడ్ ఎంటర్ చేసి, సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేయాలి. ఇప్పుడు మీ ఆధార్‌కి లింక్ అయి ఉన్న మొబైల్ నంబర్ కనిపిస్తుంది.






# 72రైళ్లను రద్దు చేసిన కేంద్ర రైల్వే శాఖ

## మరో 22 రైళ్ల రూట్ మార్పులు

ముందడుగు రైల్వే శాఖ

రైలు ప్రయాణాలు చేసే వారికి ఇండియన్ రైల్వేస్ అలర్ట్ జారీ చేసింది. పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు నిర్ణయం తీసుకుంది. డిపార్ట్ మెంట్ మహారాష్ట్రలోని రాజ్‌నంద్‌గావ్, నాగ్‌పూర్ రైల్వే స్టేషన్‌ల మధ్య మూడవ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆయా మార్గాల్లో ప్రయాణించే 72 రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 4వ తేది నుంచి 20వ తేదివరకు ఉండనుంది. వీటితోపాటు మరో 22 రైళ్ల రూట్ కూడా మార్చినట్లు ఇండియన్ రైల్వే అధికారులు పేర్కొన్నారు. రాజ్‌నంద్‌గావ్, నాగ్‌పూర్ రైల్వే స్టేషన్‌ల మధ్య మూడవ ట్రాక్ నిర్మాణం కోసం భారత రైల్వే దాదాపు రూ.3,540 కోట్లు ఖర్చు చేస్తోన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే మహారాష్ట్రలోని రాజ్‌నంద్‌గావ్-కలమ్ స్టేషన్ మధ్య పెద్ద ఎత్తున ప్రీ-ఇంటర్‌లాకింగ్, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇలాంటి తరుణంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముందుచర్యల్లో భాగంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ముందడుగు
మంగళవారం, 13-08-2024, హైదరాబాద్

## 53 ప్రముఖ యాప్స్ లో 52 యాప్స్
# మోసపూరితమైనవే

ASCI The Advertising Standards Council of India

ముందడుగు హైదరాబాద్

ప్రఖ్యాత భారతీయ యాప్‌లలో మోసపూరిత నమూనాలు ఎక్కువగా ఉన్నాయని ప్రముఖ డిజైన్ సంస్థ ప్యారలల్ హెచ్‌క్యూ సహకారంతో ఏఎస్ సీఐ అకాడమీ చేసిన సంచలన అధ్యయనంలో వెలుగులోకి వచ్చింది. సోమవారం జరిగిన వెబ్‌నార్‌లో అగ్రశ్రేణి భారతీయ యాప్‌ల లోని మోసపూరిత నమూనాల అధ్యయనమైన ఈ సమగ్ర వెబ్ నివేదికను 'కాన్షియస్ ప్యాటర్న్స్' పేరుతో ఆవిష్కరించారు. విశ్లేషించబడిన 53 యాప్‌లలో 52 మోసపూరిత డిజైన్ పద్ధతులను ఉపయోగిస్తాయని అధ్యయనం వెల్లడించింది. డార్క్ ప్యాటర్న్‌ల విస్తృత ఉపయోగం వినియోగదారు స్వయంప్రతిపత్తిపై మరియు సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవడంపై ప్రభావం చూపుతుందని గమనించడం ముఖ్యం. ఈ యాప్‌లు ఏకంగా 21 బిలియన్ల సార్లు డౌన్‌లోడ్ చేయబడడం వినియోగదారులపై అవి కనబరిచే తీవ్ర స్థాయి ప్రభావం అవకాశాన్ని సూచిస్తుంది. కొన్ని యాప్‌లు ఉపయోగించే మరిన్ని నైతిక డిజైన్‌ల ఉదా హరణలను కూడా ప్రత్యామ్నాయాలుగా ఈ నివేదిక అందిస్తుంది, వాటిని పరిగణించవచ్చు. అంతేగాకుండా మరింత అవగాహనతో కూడిన యాప్ రూపకల్పనకు సహాయపడే స్కోరింగ్ సాధనం కూడా ఇందులో ఉంది. ఈ విభాగంలో వివిధ సవాళ్లు, ఆచరణాత్మక పరిష్కారాలను చాటిచెప్పడానికి నాస్కామ్ మరియు ప్యారలల్‌తో ఏఎస్ సీఐ భాగస్వామ్యం కలిగి ఉంది.

# కంగువ ట్రైలర్ వచ్చేసింది..



అగ్ర హీరో సూర్య నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'కంగువ'. శివ దర్శకుడు. స్టూడియోగ్రీన్, యూవీ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. దసరా కానుకగా అక్టోబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఓ రహస్య దీవిలో రెండు గిరిజన తెగల మధ్య జరిగిన పోరాటం ఇతివృత్తంగా ఈ సినిమాను తెరకెక్కించారని ట్రైలర్ ద్వారా అర్థమవుతున్నది. యుద్ధపిపాసిగా ప్రతినాయకుడు బాబీ డియోల్ కనిపించగా, తనవారిని రక్షించుకోవడానికి తానే ఒక సైన్యంగా మారే యుద్ధవీరుడు కంగువ పాత్రలో సూర్య కనిపించారు. భారీ ఓడలపై జరిగే యుద్ధ ఘట్టాలు, విజువల్స్ హాలీవుడ్ సినిమాల స్థాయిలో ఉన్నాయి. బాబీ డియోల్, సూర్య పాత్రలు సమవుజ్జీల సమరాన్ని తలపించాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వెట్రి పళనిస్వామి, నిర్మాతలు: కేఈ జ్ఞానవేల్‌రాజా, వంశీ, ప్రమోద్, రచన-దర్శకత్వం: శివ.



## విద్యార్థి తండ్రి చొక్కా విప్పి
# అవమానించిన టీచర్లు

- అవమానంపై మంత్రికి ఫిర్యాదు చేసిన వ్యక్తి
- చర్యలకు ఆదేశించిన మంత్రి సంధ్యారాణి

ముందడుగు ఆంధ్రప్రదేశ్

ఓ విద్యార్థి తండ్రిని పాఠశాల కమిటీ ఎన్నికల్లో చొక్కా విప్పి అవమానించడంపై మంత్రి సంధ్యారాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మన్యం జిల్లా మక్కువ మండలంలోని మోడల్ స్కూల్‌లో ఇటీవల జరిగిన పాఠశాల కమిటీ ఎన్నికల సమయంలో ఓ విద్యార్థి తండ్రిపై టీచర్లు ప్రవర్తించిన తీరును ఆమె తప్పుబట్టారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మంత్రి ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా తనకు జరిగిన అవమానంపై ఆ విద్యార్థి తండ్రి మంత్రికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి సంధ్యారాణి అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. పసుపు చొక్కా వేసుకున్నారన్న సాకుతో గిరిజనుడిని రెండు గంటల పాటు నగ్నంగా నిలబెట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఈ ఘటనకు బాధ్యులపై విద్యాశాఖ తక్షణమే కఠిన చర్యలు చేపట్టేలా చూడాలని డీఈవోను ఆదేశించారు. ఈ ఘటనకు సహకరించిన హోంగార్డు, హెచ్‌ఎంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

# రాష్ట్రపతి నుంచి ఆహ్వానం



ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి, తెలుగు నటి సంధ్యారాజుకు అరుదైన గౌరవం దక్కింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే 'ఎట్ హోమ్' వేడుకలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి సంధ్యారాజుకు ఆహ్వానం అందింది. తొలిచిత్రం నాట్యంతో రెండు జాతీయ అవార్డులను దక్కించుకుంది సంధ్యారాజు. హైదరాబాద్‌లో నిశ్శంఖల డ్యాన్స్ ఆకాడమీని స్థాపించి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక నృత్య కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు సినీరంగంలో నటిగా రాణిస్తున్నారు. 'ఎట్‌హోమ్' కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని సంధ్యారాజు ఆనందం వ్యక్తం చేసింది.